# నెత్తుటి మరకలు



కోడికూతకీ, కాకుల కలకలానికీ సంధికాలంలో నిద్ర మేల్కొనడం బురాన్ సాయెబుకి అలవాటు. అలా లేచి, తూర్పు తలుపు విచ్చుకోక ముందే ఏట్లో కాలకృత్యాలు తీర్చుకొని, ఆవలివైపునున్న పొలానికెళ్ళి, తొలి సంజ వెలుగులు పరుచుకోకముందే కన్నతల్లి వంటి భూమితల్లిని చూసుకోటం.....ఊహ తెలిసి నప్పట్నుండీ అతడు పాటిస్తున్న నియమం. తండ్రి ఖాసింకు అతనొక్కడే కొడుకు గావటానా వల్లమాలిన ప్రేమతో బురాన్‌ను పెంచాడు. కొడుకు బురాన్ కూడా తండ్రి వారసత్వంగా ప్రేమతో పాటు పై అలవాట్లన్నీ నేర్చుకున్నాడు.

పారంపర్యంగా చేసుకొస్తున్న వ్యవసాయమే అతనికి తెలిసిన విద్య. పంచె పైకెగ్గట్టుకొని, ఆఫారం (బనియను లాంటి టీషర్టు) మీద చారల తువ్వాలేసుకొని, తలకి గళ్ళరుమాలు చుట్టుకొని, చేతికున్న వెండి కడియం నడక కనుగుణంగా దరువేస్తుంటే, బేగరి సాయన్న యేటా కుట్టిచ్చే కిర్రుచెప్పుల మధురాలాపనల్ని వింటూ, నాటు పొగాకు నింపుకున్న పొగాకు చుట్ట సుతారంగా పీలుస్తూ....అలా వెళ్తూంటే ఆకాశయానం చేస్తున్న గంధర్వులను మరిపిస్తున్నట్టుంటుంది బురాన్‌కు.

మానాభిమానాలకు ప్రాణం పెట్టే బురాన్‌కి ఊళ్ళో వాళ్ళంతా సలాములు కొట్టేవాళ్ళే. అది అతని వయస్సుని తగ్గించి ఉషారును పెంచే టానిక్‌లా పనిచేస్తుంది. అందుకే అతనికి అరవయ్యేళ్ళంటే నమ్మరు ; నలభై అంటే అనుమానించరు.

"అన్నూ బెటా ! జెల్దీ బైలోఁకో హకాల్లెకాబెటా ! దానే దాల్నేకో దేర్ హోతా నైతో." (అన్నూ ! త్వరగా ఎడ్లను తోలుకొనిరా ! లేకుంటే విత్తనాలెయ్యటానికి ఆలస్యమౌతుంది.) ఇంట్లో నుండి బయల్దేరుతూ కొడుకుని కేకేశాడు.

పెళ్ళాం కౌగిట్లో కమ్మగా నిద్దరోతున్న అన్వర్‌కు మెలకువ రాలేదు. కాని భార్య సలీమా, మామ పిలుపుతో ఉలిక్కిపడ్డది. మొగుణ్ణి కుదుపుతూ గుస గుసగా సమాచారం చెవిలో వేసింది - అప్పటికే చాలా దూరం వెళ్ళి ఉంటాడు బురాన్.

"ఆఁ !" అంటూ గావుకేక పెట్టాడు అన్వర్. (ఎన్నిసార్లు పిలిచినా లేవకపోయేసరికి నడ్డి కింద నాతి మెత్తగా గిల్లింది మరి సలీమా) అందులో విసుగుదల, అంగీకారం, ఆందోళనా మిళితమై ఉన్నాయి. కాని ఆ కేక పర్యవసానాన్ని ముందూహించలేకపోవడం అన్వర్ రోజూ చేసే పొరపాటు.

యథాలాపంగా ఆ కేకకు ప్రతిఫలంగా అన్వర్ కొడుకు ఆరేళ్ళ అంజాద్ మగత నిద్రలోనుంచి మేల్కొని, ఆర్నొక్కరాగంలో..... "దాదా కె సాథ్ మై జాతూఁ (తాతయ్యతోపాటు నే నెల్తా )" అంటూ పాటందుకున్నాడు ఎప్పటిలాగే.

"థూత్ తెరీకి, అబే......మూ మూఁఫ్" (నీ యవ్వ.....నోర్మూయ్ !) నిద్రమత్తు పూర్తిగా వదిలిపోగా పెళ్ళాం మీది కోపం కూడా కొడుకు మీద రుద్దబోయాడు అన్వర్.

తండ్రి యేమంటున్నాడో వినేందుకా అన్నట్లు క్షణం పాటు సౌండ్ కట్టేసి, అతను మాట్లాడ్డమైపోగానే మరింత శ్రుతి పెంచాడు అంజాద్.

"అబే....." చెయ్యెత్తాడు అన్వర్.

"అరె, క్యోం బచ్చేకు చుప్ కే డరాతే ? (ఎందుకు పిల్లాడ్నూరికే భయపెడ్తారు ?)" ముద్దుగా భర్తను కసురుకొని, "ఇదరా బెటా !" అంటూ ఏడుస్తున్న కొడుకునక్కున జేర్చుకుంది సలీమా. భర్త సంకటస్థితి నోరకంట గమనించి, నవ్వుని బిగబట్టుకుంటూ రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యేందుకు సిద్ధపడసాగింది.

ముప్పై మూడేళ్ళ అన్వర్‌కు అంజాద్ ఒక్కడే కొడుకు. పెళ్ళి తొందరగానే అయినా, పిల్లాడాలస్యంగా పుట్టడం, ఆ భార్యాభర్తల ప్రేమలోని నవ్యతను పెంచి పోషించింది. పుత్రోదయం తర్వాత అది మళ్ళీ కొత్త మొగ్గలు తొడిగింది.

తండ్రి పట్ల అన్వర్‌కి, మామ పట్ల సలీమాకీ వల్లమాలిన గౌరవం.

బోర్లించిన గంపను పైకెత్తగానే కోళ్ళన్నీ ఆహారాన్వేషణకై వీధుల్లో కురికినట్లు ఆ పల్లెటూళ్ళోని వాళ్ళంతా తమ తమ పనుల్లో నిమగ్నమైపోయారు. అయిన ఆలస్యానికి తనను తాను నిందించుకుంటూ ఎడ్లను తోలుకొని హడావుడిగా బయలుదేరాడు అన్వర్.

"ఏమోయ్ అన్వర్ ! ఈ రోజు కందురు సంగతి గుర్తుజెయ్ మా బావకి. మధ్యాహ్నం కల్లా మైబుస్మాల్ల కాడికొచ్చే సెయ్యిమను. మరచిపోకు" దార్లో ఎదురైన పెదకాపు నర్సయ్య బురాన్ సాబ్‌ను పంపాల్సిందిగా అన్వర్‌తో చెప్పాడు. ఊళ్ళో అందరూ బంధువులే.

కులమతాల కతీతంగా అందరూ ఏదో ఒక వరసబెట్టి పిలుచుకోటం అక్కడి ఆనవాయితీ.

"మంచిది మామా ! అట్లే జెపుతా."

❄ ❄ ❄

నర్సయ్య ఇల్లు బంధుమిత్రులతో కళకళలాడి పోతోంది. మైబుస్మాన్ (మహబూబ్ ఉస్మాన్) దర్గాకి కందురు (మొక్కుబడి చెల్లింపుగా తరచూ దర్గాల దగ్గర మేకల్ని కోసి, విందు నిస్తారు – ఈ తతంగాన్నే 'కందు'రని వ్యవహరిస్తారు) ఏర్పాట్లలో ఇంటిల్లిపాదీ తలమునకలై ఉన్నారు.

ఇద్దరు కొడుకులూ, కోడళ్ళూ చకచకా తమ పనులు చేసుకుంటున్నారు. అత్తారింటి నుంచి వచ్చిన కూతురు మాణెమ్మ కూడా అన్నీ తానే చక్కబెడ్తున్నట్లు హడావుడి పడిపోతుంది.

ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దర్గాకి వెళ్ళేందుకు పెద్ద కొడుకు అనంతయ్య ఎడ్లబండిని సిద్ధం చేస్తున్నాడు. చిన్న కొడుకు స్వామి అవసరమైన పాత్రలు, విస్తళ్ళు, నీళ్ళ డ్రమ్ము, పట్టాలు వగైరా సర్దుతున్నాడు. ఆడవాళ్ళు (కోడళ్ళు) వంటకవసరమైన వస్తువులన్నీ సమకూర్చుకుంటూ అప్పుడప్పుడూ తమకు తెలిసినవే అయినా, "ఇది తీసుకోవాలా అత్తమ్మా ?" "ఇది అవసరం లేదు గదత్తమ్మా !" అంటూ అత్త మీది గౌరవాన్ని అభ్యర్థనల ద్వారా పెంపుచేస్తున్నారు.

వాళ్ళు సరిగ్గానే చేస్తున్నట్టు ఆ పెద్దావిడకి తెలుస్తూన్నా, తన పెద్దరికం కాపాడుకునేందుకు కొన్నిటికి ఆలోచిస్తున్నట్టు నటిస్తూ కొన్నిటికి సవరణలు చేస్తూ, మరికొన్నిటికి తన అనుభవాన్ని జోడిస్తూ......రకరకాల హావభావాలు చూపుతూంది.

కులస్థుల్నీ,ఆత్మీయుల్నీ మరోసారి పిలుస్తూ, దర్గా వైపు కదిలి పోయాడు నర్సయ్య. అందరూ అక్కడికి చేరుకునేసరికి ఒంటిగంటయ్యింది.

పిల్లలంతా రంగురంగుల బట్టల్లో, సీతాకోకచిలుకల్లాగా కలకలాలు, కేరింతల్తో ఎకరం మేర పరుచుకొని ఉన్న దర్గా తోటలో ఆహ్లాదాన్ని నింపుతున్నారు. ఆడవాళ్ళు వంటసామాగ్రిని ఓ క్రమంలో సర్దుకుంటున్నారు. మగాళ్ళలో కొందరు కూడా తెచ్చిన కట్టెలకు తోడుగా మరిన్ని పుల్లలు ఏరుతున్నారు. మరో ఇద్దరు బలమైన కొమ్మకు పగ్గంతాడు కట్టి ఉంచారు. ఇద్దరు కత్తులు నూరుతున్నారు అక్కడున్న చకుముకి రాళ్ళ మీద. అక్కడికి వంద గజాల దూరంలో బాట పక్కన పొగడపూలనేరుకోవడంలో లీనమై ఉన్నారు అమ్మాయిలు.

చూస్తుండగానే రెండైపోయింది. ఇంకా ఏం చేయాలో తోచని స్థితిలో పడిపోయారు కొందరు. అసహనంగా ఎవ్వరికోసమో ఎదురుచూస్తున్నాడు నర్సయ్య.

"నమస్కారం !"

తెల్లని ప్యాంటూ, లాల్చీల్లో అధునాతనంగా కనిపిస్తున్న ఆగంతకుడు రెండు చేతులూ జోడించి, తనకు నమస్కరించడం చూడగానే నర్సయ్య కంగారు పడిపోయాడు. నోటమాట రాలేదు. యాంత్రికంగా రెండు చేతులూ జోడించాడు.

పక్కనే ఉన్న బస్తీ (వికారాబాద్) కెళ్ళినా, ఏదైనా ఆఫీసులో పని తగిలినా అక్కడి సేఠ్‌లకు, ఆఫీసర్లకు తాము వంగి వంగి దండాలు పెట్టడమేగాని, ఇలాంటి నమస్కారాలందుకోవడం ఎన్నడూ ఎరుగడు మరి.

అందమైన ఆ యువకుడు మరింత అందంగా నవ్వాడు.

ఆడవాళ్ళు తమ పనులు చేస్తున్నట్టే చేస్తూ, అతడ్నోరకంట గమనించ కుండా ఉండలేకపోయారు.

క్షణాల్లో చిన్న గుంపు పోగయ్యిందక్కడ.

'ఎవరీతను ?' అన్నట్లు పక్కనే కూర్చున్న సంగయ్య వంక చూశాడు నర్సయ్య.

"నా పేరు కళ్యాణ్ !" సంగయ్య సమాధానం చెప్పడానికి ముందే ఆ యువకుడు తనను తాను పరిచయం చేసుకున్నాడు. "వికారాబాద్ నుండి వచ్చాను."

"రాండ్రి ! రాండ్రి ! గిట్ల గూసోండి !" గొంగడి సరిజేసి స్థలం చేశాడు నర్సయ్య.

'పర్వాలే'దంటూనే సుఖోపవిష్టుడయ్యాడు కళ్యాణ్ !

"ఇక్కడెవరన్నా చుట్టాలున్నారా ?" - అతని రాకలోని ఆంతర్యం గ్రహించలేక, ఎవరి తాలూకో ఊహించుకోలేక, ఏ కారణం చేత వచ్చాడోనని సంకోచిస్తూ అడిగాడు నర్సయ్య.

"ఉన్నారు ! మీరంతా చుట్టాలు కాదా ?" తమషాగా నవ్వాడు అతడు.

ఆ మాటతో అందరి దృష్టీ అటు మళ్ళింది. 'లక్ష్మణ దేవర నవ్వు' నపార్థం చేసుకున్నట్లు అతడు ఎవరి తాలూకో అర్థం చేసుకునేందుకు ఎవరికి వాళ్ళు అంతరంగాల్లో మల్లగుల్లాలు పడుతూ ఆలోచించుకోసాగారు.

"ఆగానికమ్మా అంటె, ఎవనికి పుట్టినవు బిడ్డా ! అన్నట్లున్నది నీ కత. మనిషికి మనిషి సుట్టమే. కాని, నీ అసలు సుట్టమెవరో చెప్పు" కుండబద్దలు గొట్టినట్లు అనేశాడు కావలికారు బాగయ్య.

చివుక్కుమంది కళ్యాణ్ మనస్సు; గతుక్కుమన్నాడు నర్సయ్య; అబ్బుర పడ్డారక్కడున్నవాళ్ళు- బాగయ్య మాటలకు ముందుగా కళ్యాణే తేరుకున్నాడు.

"నా సంగతి తర్వాత చెబుతాగని, మీరెవరికోసమో ఎదురు చూస్తున్నట్టున్నారే" అన్నాడు బలవంతపు నవ్వు పులుముకొని.

"ఆ ! ఓ పెద్దమనిషికోసం చూస్తున్నం" చెప్పాడు నర్సయ్య.

"ఆయన తర్వాతొచ్చి చేరతాడేమో, మీరు పని మొదలెట్టొచ్చుగా" అక్కడి ఏర్పాట్లు పరిశీలిస్తూ అన్నాడు - కళ్యాణ్.

"అబ్బో, అతను రాందే పని జరుగదు"- నర్సయ్య కంటే ముందుగానే జవాబిచ్చాడు బాగయ్య.

"సర్పంచా ? ఎమ్మెల్యేనా ?" - ఆసక్తి ప్రదర్శించాడు కళ్యాణ్.

"ఆc ! గా సర్పంచి గాడెప్పుడూ వికారాబాద్‌లనే జస్తడు - ఉంచుకున్న ముండ దగ్గెర. ఇగ ఎమ్మెల్యేకు మా ఊరే దెల్వది." ఓ ముసలాయన వివరించేశాడు.

"మరి?" - కళ్యాణ్ కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"బురాన్‌సాబ్ బావ కోసరం !" - గౌరవం నింపుకున్న నర్సయ్య కంఠం.

"ఆయనెవరు ?"- కళ్యాణ్ గొంతులో అనుమానం.

"కందురు జేసేదాయనే. పీర్లకు ఫాత్యాలియ్యాలె. దట్టీ ఎక్కియ్యాలె మాలీజ (నైవేద్యం) పెట్టాలె. ఊదుపొగెయ్యాలె. అలాల్ జెయ్యాలె.... గివన్ని ఎవ్వరు జేస్తరు మరి ?" బాగయ్య ప్రశ్నలో సమాధానం కలిపాడు.

అవన్నీ వింటున్న కళ్యాణ్ మొహంలో రంగులు మారడాన్ని ఎవరూ పట్టించుకోలేదు. కారణం.....వాళ్ళంతా ఎదురు చూస్తున్న బురాన్‌సాబ్ వచ్చేశాడు. అంతసేపూ ఆవరించిన స్తబ్దత స్థానే చైతన్యం వెల్లివిరిసింది.

అరగంటసేపు ఏదో హడావుడి చేసి, వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు బురాన్‌సాబ్. చాలామంది వంట ఏర్పాట్లలో పడిపోయారు. పసిపిల్లలు అలసి, నిద్రపోతున్నారు. ఆడవాళ్ళలో మిగతావాళ్ళు కబుర్లలోకంలో కొట్టుకోసాగారు. వీళ్ళకి ఎడంగా ఓ మామిడిగున్నకింద కళ్యాణ్, నర్సయ్య, మరికొంతమంది యువకులూ కులాసాగా లోకాభిరామాయణానికుపక్రమించారు.

"బాబాయిగారూ ! మేకల్నిలా సాయెబులతో గోయించడమేంది ?" ఆ కొద్ది సమయంలోనే వరస కలపడంలో మెళకువ సాధించాడు కళ్యాణ్.

"తప్పు సారూ ! మనం గోస్తే ముర్దారయితది. ఆళ్ళు గోస్తేనే అలాల్" కళ్యాణ్ అపచారం చేస్తున్నట్టు బాధపడిపోయాడు నర్సయ్య.

"అంటే" అమాయకత్వం నటస్తూనే సూటిగా అడిగాడు కళ్యాణ్.

సమాధానం చెప్పలేకపోయాడు నర్సయ్య. వీళ్ళ సంభాషణ యువకుల్లో ఆసక్తిని రేకెత్తించింది.

"బాబాయిగారూ ! ఇదంతా ట్రాష్.....అంటే నమ్మదగింది కాదు. మోసం! మహమ్మదీయులు మనదేశంలోకి దోపిడి దొంగల్లా వచ్చి, రాజ్యాలు చేసుకొని , ఆపై వాళ్ళ సంప్రదాయాన్నంతా మన నెత్తినరుద్దారు. వాళ్ళు చేస్తే మంచి, మనం చేస్తే చెడేమిటి ? కత్తి ఎవడి చేతిలోనైనా కత్తే - తెగగోయడం దాని లక్షణం."

గమనిస్తున్న వాళ్ళ మొహాల్లోని ఉత్సుకత కళ్యాణ్‌ని మరింత రెచ్చగొట్టింది.

"ఈ పీరీలంటే ఏంటి ? చనిపోయిన వాళ్ళ సమాధులు. వాళ్ళ మతానికి సంబంధించిన నమ్మకాలు. ఎక్కడో యుద్ధంలో ఎవరో ఇద్దరు సాయెబులైన యువకులు ప్రాణత్యాగం చేశారని, వాళ్ళ పేర్న సమాధులేర్పరచి, పీరీలు నిలబెట్టి, ఆ త్యాగానికి సంకేతంగా ఉత్సవాలు చేస్తున్నారు - యేడాదికి రెండుసార్లు మనమంతా అది అనుసరించడమేగాదు, స్వయంగా మనమే ముందుండి ఆ ఉత్సవాన్ని జరిపే పరిస్థితులేర్పరిచారు. హిందువులు గొఱ్ఱెల్లా, వాళ్ళు ఆడించినట్లల్లా ఆడుతున్నారు. సైన్స్ అభివృద్ధి చెందిన ఈ కాలంలో కూడా, మతవిశ్వాసాలు ఎవరికి వాళ్ళు తెలుసుకుంటున్న తరుణంలో.....ఇంకా ఇలా మనం వాళ్ళననుసరించడం ఏం బాగుంది ?.... చివరకు మన పిల్లల పేర్లు గూడా మనవి కాకుండా ఆశన్న (హసన్), ఊశన్న (హుసెన్), సైదులు (సయ్యద్), గైబులు (గైబుస్మాన్) అంటూ మనమే మతం మార్చుకునే స్థాయికి దిగజారాము."

అలా సాగిన కళ్యాణ్ ప్రసంగం, రెండు మత సంప్రదాయాల మధ్యగల వైరుధ్యాల్ని వివరించడమే గాదు. యువత మెదడులో వైషమ్యాలనూ పురిగొల్పింది. నర్సయ్యకు ఆ ప్రసంగం నచ్చకపోగా, తెలియని భయాన్ని నింపింది.

* * *

"ఆదాబ్ !"

తోటలో టమోటాలు ఏరడం (తెంపడం)లో నిమగ్నమైవున్న బురాన్‌సాబ్ గబుక్కున తల పైకెత్తి చూశాడు.

ఎవరో ఆగంతకుడు. తెల్లని కుర్తా పైజామాలో, కళ్ళకు సుర్మాతో, మీసాల్లేని పిల్లిగడ్డంతో ముస్లిం మతానికి ప్రతీకగా వెలిగిపోతున్నాడు. అతడు తనకే నమస్కరిస్తున్నాడని అర్థంకాగానే కంగారు పడిపోయాడు.

అప్పుడప్పుడూ చుట్టుపక్కల ఊళ్ళ ముస్లింలు తనను కలిసేందుకు రావటం పరిపాటే. ఈ యువకుడ్నెప్పుడూ చూసినట్టు లేదు. పైగా ఆ వేషం, సంస్కారం... సాక్షాత్తూ అల్లాహ్ పంపిన దూతలా కనిపిస్తున్నాడు.

ప్లాస్టిక్ బిందెలోని నీళ్ళతో చేతులు గబగబా కడిగేసుకొని, గట్టు మీదున్న తుమ్మచెట్టు కింద గడ్డి మీద రుమాలు పరచి, కూర్చొమ్మంటూ మర్యాద చేశాడు.

చిరునవ్వుల వెన్నెలలు విరియిస్తూ అతడు కూర్చున్నాడు. వాళ్ళ సంభాషణంతా ఉర్దూలో సాగింది. కాకపోతే ఆ యువకుని ఉర్దూలో పార్శీ, బురాన్ ఉర్దూలో అక్కడక్కడా తెలుగూ కలిసిపోయి ఉన్నాయి.

"మీరు ముస్లింలే కదా ?"

"అవును"

"ఇక్కడెన్ని కుటుంబాలుంటాయ్ ?"

"పది - పదిహేను."

"మీ వేషం ఇలా ఉందేవిటి ?"

"ఊళ్ళలో ఇలాగే ఉంటారు. మా తాతల తరం నుండీ వ్యవసాయమే ఆధారం. పంచెకట్టు - రుమాలు చుట్టే మాకు సౌకర్యంగా ఉంటాయి."

"క్రమం తప్పకుండా నమాజు చేస్తారా ?"

"..........."

"పండుగలన్నీ జరుపుకుంటారా ?"

"ఆఁ ! అన్నీ !"

"అంటే ?"

"ఏరువాక మొదలు బక్రీద్ దాకా !"

"వినాయక చవితి ఉత్సవాల్లో కూడా పాల్గొంటారా ?"

"ఆ ! అవును ! నవరాత్రి భజనల్లో తబలా వాయించేది మా అన్వరే."

"పీరీల పండుగలో హిందువులు పాల్గొంటారా ?"

"ఊఁ ! పీరీలు పట్టుకునే వాళ్ళలో ఆశయ్య కూడా ఉన్నాడు."

అలా పెద్ద ఇంటర్వ్యూ సాగింది - ఓ గంట సేపు. కన్‌క్లూజన్‌గా ఆ యువకుడిలా చెప్పాడు.

"ఇకనైనా ముస్లింలా బతకడం నేర్చుకోండి. జిహాద్ అంటే ఏమిటో గ్రహించండి. మన మతానికి సంబంధించిన పండుగల్లో ఆ హిందువులను తలదూర్చనీయకండి. అలాగే వాళ్ళ ఉత్సవాల జోలికెళ్ళకండి. ఈ ఊళ్ళో మంచి మసీదు కడదాం ! మీరంతా సహకరిస్తే ఏమైనా చేయొచ్చు. మన మతం ఐకమత్యానికి మారుపేరు. ఏదైనా సాధించగలం. ఆలోచించండి !..." అనర్గళంగా సాగిపోతోందాతడి గళం.

బురాన్‌సాబ్‌కు ఇదంతా అయోమయంగా, కొత్తగా ఉంది. క్రమేపి ఆ యువకుడి మీద గౌరవం అనుమానంగా మారసాగింది. కాని, అక్కడే ఉన్న అన్వర్‌లో, అతడ్ని బురాన్‌కు పరిచయం చేసేందుకు తీసుకొని వచ్చిన బాబర్, జిలానీల్లో ఏదో ఉత్సాహాన్నీ, అలజడినీ సృష్టించసాగాయి.

❊ ❊ ❊

అన్వర్ నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతున్నాడు.

హనుమండ్ల గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం దగ్గర చేస్తున్న భజన లౌడ్ స్పీకర్ గుండా నేరుగా అతని చెవులనే తాకుతోంది. ప్రత్యేకించి తబలా శబ్దం. అది ఏమాత్రం వినసొంపుగా లేకపోగా కర్ణ కఠోరంగా అనిపించసాగింది. మధ్య మధ్యలో తన అసంతృప్తిని తెలియజేసే శబ్దాలు నోటినుండి వెలువడుతున్నాయి.

"ఎందుకట్ల ఊరికె పరేషానైతవ్ ? ఎల్లరాదు !" భర్త అవస్థను గమనిస్తున్న సలీమా, ఉండబట్టలేక అనేసింది.

"ఏయ్ ! నువ్వు నోర్మూసుకో ! ఆల్లకులేని పట్టింపు నాకేంది ? నేను రాకపోతే ఆల్లొచ్చి పిలుసుకొని పోవాలెగద మరి ? ఒక్క కొడుకూ రాడేంది ?" కస్సుమంటూ దుప్పటి ముసుగెట్టేశాడు.

ఆశ్చర్యపోయింది సలీమా ! మాటి మాటికీ 'వాళ్ళూ', 'వాళ్ళ'నడం, నీచంగా మాట్లాడడం అతని నోటి నుంచి వినడం అదే కొత్త.

"అదేందీ, బాబాయి వాళ్ళెప్పుడైనా నిన్ను పిలిచిన్రా ? ఒక్కోసారి టైమైపొయ్యిం దంటాని, అన్నం కూడా తినకుండా ఊరందరికంటె ముందు జేరి ఠంగ్ - ఠంగ్‌మాంటాని తబలా సూర్ జేసుకుంటావ్ గదా !" గతాన్ని వర్తమానంతో పోల్చుకోలేక వాపోయింది.

ఆ దెబ్బ అన్వర్ గుండెల్లో తగిలింది. క్షణంసేపు మాట్లాడలేకపోయాడు.

"మరి నేనెల్లకపోతే ఆల్లన్నా వొచ్చి పిలవొచ్చు గదా !" ఏదో పోగొట్టుకున్న బాధ అతడి పేగుల్ని కోస్తున్నది.

"పిలవకపోతే ఎల్లరాదా ?"

తేలు కుట్టిన దొంగలా మెదలకుండా ఉండిపోయాడు అన్వర్.

❋ ❋ ❋

"ఏంరా ? తబలా గొట్టనీకె అన్వర్ రానన్నడా ?" నర్సయ్య కొడుకు అనంతయ్యకు ఆ భజన ఏమాత్రం రుచించడం లేదు. ఊశయ్య వాయిస్తున్న వాద్యం భయంకరంగా అన్పించసాగింది కూడా.

"ఎవ్వడు వొయ్యి అడిగిండు ?"– 'వాడితో మనకేంటి ?' అన్న భావం శ్రీనివాస్ మాటల్లో. కళ్యాణ్ మంత్రం యువత మీద బాగా ప్రభావం చూయించసాగింది.

"అరేయ్ ! రాంచెంద్రీ ! అన్వర్‌ను పిలుచుకురా, పో !" ఆదేశించాడు అనంతయ్య.

వికారాబాద్‌లో పదో తరగతి చదూతున్న రాంచందర్ గబుక్కున లేచాడు.

"ఏయ్ ! వద్దూకోరా !" వెంటనే అడ్డుకున్నాడు మరో యువకుడు కైలాస్.

"ఎందుకట్లా ?" అనంతయ్య అహం దెబ్బతిన్నది.

"ఆ ! వచ్చేటోడైతే వాడే వొస్తుండె. రావద్దనుకున్నాడేమో. రాకపోతే మానె. వాడు రాకుంటే భజనాగిపోతదా ?" డొంకతిరుగుడుగా అన్వర్ రాకని వ్యతిరేకించాడు కైలాస్ మళ్ళీ.

"వాని మనసులేమున్నదో తెలుస్తదిగదా, అడిగి రానీ రాదు !" అనంతయ్యను అగౌరవపరచడం శ్రీనివాస్‌కు నచ్చులేదు.

"ఏంది పోనిచ్చేది ? ఆ తురక సాయెబు తబలా వాయిస్తే మన దేవునికెక్కదు గూడ !" ఆవేశాన్నణచుకోలేకపోయాడు కైలాస్.

ఉలిక్కిపడ్డాడు అనంతయ్య ; అక్కడి వాతావరణం అతడికి కంపరం పుట్టించింది ; రాంచందర్ నిలబడే ఉన్నాడు ; అనంతయ్య కూర్చోలేదు.........

భజన మళ్ళీ మొదలైంది.

❋ ❋ ❋

దర్గా మసీదు దగ్గర పీరీల వద్ద డప్పులు మోగుతున్నాయి.

బాబా మియా కొడుకు అక్బర్‌కు 'సవారి' (శివం) తెప్పించేందుకు రకరకాల ప్రయత్నాలు సాగుతున్నాయి. మంత్రించిన వెండి కడియమొకటి జబ్బకు తొడిగారు;

మరో దండకి తాయెత్తు కట్టారు. కాలికో పంచలోహ కడియం వేశారు; నిమ్మకాయలు కోశారు; సాంబ్రాణి పొగ దట్టించారు.

అప్పుడప్పుడూ వాడు సడెన్‌గా నిద్రమత్తులోకి వెళ్ళినట్టే వెళ్ళి మళ్ళీ మామూలుగా అయిపోతున్నాడు - ఇరవై అయిదేళ్ల అక్బర్. అంతకుమించి ఫలితం కనబడటంలేదు.

"ఊఁ ! వీనికెన్నడు సవారీ రావలె. పాచి నా కొడుకు. పొద్దున లేచి మొహం గడిగితేనే పాపమనుకునేవోడు. వీని మాట లొంకర, చేత లొంకర, వీని వల్లగాదుగాని, ఆ ఆశయ్యను లేపుకొనిరా పోండి !" యాభయ్యేళ్ళ చాన్‌పాషా నిర్మొహమాటంగా తన మనసులోని మాటను వెళ్ళగక్కాడు. ప్రతియేటా ఆశయ్య సవారీగా పీరీని పట్టుకోవడం అతనికి బాగా నచ్చే అంశం. ఆ స్థానాన్ని మరొకరెవ్వరూ భర్తీ చేయలేరనేది అతని ప్రగాఢ విశ్వాసం.

అంతసేపూ ఏదో ఆవహిస్తున్న ఫీలింగ్‌లో ఉన్న అక్బర్ పూర్తిగా తేరుకుండిపోయాడు.

"అవసరం లేదు. సవారి రాకపోతె పీరీ పట్టుకోగూడదా ? అట్లే పట్టుకొమ్మనుండ్రి." చాన్‌పాషా ఆలోచనల్ని కొట్టిపారేశాడు అన్వర్.

"నిన్ను వినాయకుని దగ్గెర తబలా వాయించనీకె పిలువలేదంటాని, ఆశయ్యను ఈడకి తీసుకురావొద్దంటున్నవ్ కదారా ?" తననెదిరించడాన్ని సహించలేకపోయాడు చాన్.

"అవ్ ! అందుకే వొద్దంటున్న. ఎవ్వరి పండుగలు వాళ్ళే జేసుకోవాలె. వొగళ్ళ దగ్గెరకొగరు అవసరం లేదు"- కటువుగా అన్నాడు అన్వర్.

అంత సేపూ ఎక్కడున్నాడో కైలాస్. అన్వర్ మాట పూర్తిగాకుండానే అందుకున్నాడు.... "అరేయ్ ! అలావా ఆపెయ్యిండి రా !"

(పీరీల పండుగ సందర్భంగా మసీదు ముందర అగ్నిగుండం చుట్టూ యువకులు చేతులు - చేతులు కలుపుకొని, గంతులేస్తూ, పాటలు పాడటం ఓ సంప్రదాయ జానపద కళ - దీనికే 'అలావా' అని వ్యవహారం)

"కొత్త కొత్త లారీ లొచ్చె - లారీలల్ల పోరీలాచ్చె" అంటూ ఉత్సాహంగా గంతులేస్తున్న యువకులు డప్పుల శబ్దాన్ని మించిన కైలాసం కేకతో ఒక్కసారిగా ఆగిపోయారు.

డప్పులూ ఆగిపోయాయి.

"తురకలు దప్ప ఇంకొగడెవ్వడూ తండ్రికి దప్ప పుట్టనోడైతే ఇక్కడ ఉండగూడదు. ఎల్లిపోండి." ఆ నిశ్శబ్ద వాతావరణంలో కైలాసం గొంతు ఖణేల్మంది.

గుంపులో కలకలం మొదలైంది. ఇంతలో వెనక నుండి కైలాస్ తల మీద దుడ్డుకర్రతో బలంగా మోదారు. ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న కొందరు యువకులు లాఠీల విన్యాసం మొదలు పెట్టారు. తామేం తక్కువ తినలేదంటూ మరోవర్గం వారు కత్తులతో రంగ ప్రవేశం చేశారు.

సినిమా క్లైమాక్స్ సీన్‌లోలాగానే పోలీసులొచ్చారు – ఎనిమిది మంది యువకులు యముడితో పోరాడుతున్నారప్పటికే.

❊ ❊ ❊

ప్రపంచంలోని ఘోరాల్ని చూసి, చూసి ఎర్రబడ్డ కళ్ళతో కదల్లేక కదల్లేక పడమటి కొండల మీద వాలిపోతున్నాడు సూర్యుడు.

పొలంనుండి ఇంటికివస్తూ, చెరువు కాలవకి అడ్డంగా – దాటడానికి అనువుగా వేసిన తాటి దూలంపై కాలెట్టబోతూ ఆగిపోయాడు బురాన్‌సాబ్.

అదేక్షణంలో కాలవ దాటబోతు బురాన్‌ని చూసిన నర్సయ్య తన ప్రయత్నాన్ని విరమించుకొని, అపశకునమెదురైనట్లు మొహం తిప్పుకున్నాడు.

తను వెళ్ళేదాక నర్సయ్య రాడని నిర్ధారణ చేసుకున్న బురాన్ లుంగీ బిగింపు సరిజేసుకొని, కర్ర ఊతగా నెమ్మదిగా నడిచి అవతలి వైపు చేరాడు.

కాండ్రించి తుపుక్కున ఊశాడు నర్సయ్య.

బురాన్ తనను దాటిపోయాడనుకొని, తాటి దూలంపై కాలు మోపాడు.

చేయడ్డుపెట్టాడు బురాన్.

'ఏంటిది ?' అన్నట్టు చివుక్కున తలెత్తి చూశాడు నర్సయ్య.

జీవకళలేని బురాన్ మొహంలో, కాంతిలేని గాజుకళ్ళు ఏ భావమూ చెప్పలేకపోయాయి.

"నర్సయ్య బావా ! అక్కడెందుకుమ్మినవ్; ఆ ఉమ్మేదేదో నా మొకం మీద ఉమ్మరాదా ?!" దీనమైన మొహం, గొంతులో వణుకు; కళ్ళలో నీళ్ళు.

క్షణంపాటు జరుగుతున్నది అర్థం కాలేదు నర్సయ్యకు. మరుక్షణం.....

"బావా !" అంటూ గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు బురాన్‌ని

ఇద్దరూ చిన్నపిల్లల్లా ఒకర్నొకరు ఓదార్చుకోటం మరచిపోయి, గడ్డకట్టిన బాధంతా కరిగిపోయేలా ఏడ్చారు. అపై అక్కడే ఒకరిపక్కనొకరు చతికిలబడ్డారు.

"బ్రహ్మంగారు చెప్పిన మాట సత్యమైతున్నది బావా ! కలియుగం మునిగిపోతున్నది" - కళ్ళు రుమాలుతో అద్దుకున్నాడు బురాన్.

"బిడ్డలిట్ల రోజు రోజుకూ గొట్టుకసావాల్సిందేనా ? మనమాపలేమా?" నర్సయ్య గొంతులో దైన్యం గూడుకట్టుకుంది.

"అల్లెప్పుడో మన చెయిదాటిపోయిన్రు బావా ! మొదలు మొదలు మనం జేస్తున్నది తప్పో - ఒప్పో మనం దెలుసుకోలేక పోయినం. ఇప్పుడు దెలిసింది.... చేతులు పూర్తిగా గాలిపోయినాయ్...."

"నా బిడ్డ.... చెట్టంత బిడ్డ.... వంశానికొక్కడు.... పొట్టన పెట్టుకున్నారు." కన్నకొడుకు గుర్తుకురాగానే దుఃఖంతో బురాన్ గొంతు పూడుకుపోయింది. మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

"ఊకో బావా !.... ఊకో ! ఇదాంతా మనం జేసిన కర్మమే. అనుభవించాలె, తప్పదు మరి నీ కొడుకు వోయిందని నీ వేడుస్తున్నవ్. బతికున్న నా కొడుకును జూసుకోలేక నేనేడుస్తున్న." నిండు కుండకు చిల్లులు పడ్డట్టు వర్షించసాగాయి నర్సయ్య కళ్ళు.

మతకల్లోలంలో అనంతయ్య ఎడమ చెయ్యి విరిచేశారు వెన్నెముక కింది భాగం నుజ్జునుజ్జయింది. 'మజులర్ డిస్ట్రోఫీ' వ్యాధిగ్రస్తుడిలా మంచానికే అంకితమయ్యాడు అతడు.

అలా ఎంతసేపు కూర్చున్నారో ఇద్దరూ.

వాళ్ళ బ్రతుకునావహించినట్లే మెల్లమెల్లగా చీకట్లు దట్టమయ్యాయి.

తీతువు భయంకరంగా కూసింది.

ఉలిక్కిపడిలేచి, జీవచ్ఛవాల్లా ఇద్దరూ కదలసాగారు మౌనంగా.

(నవంబర్ **2002**, రచన ఇంటింటి పత్రిక)